











అన్నవరంలో పంపానది వద్ద సత్యదేవుడు, అనంతలక్ష్మి స్వామి, అమ్మవార్లకు హారతి ఇస్తున్న అర్చక స్వాములు

కార్తీకపౌర్ణమి సందర్భంగా అన్నవరంలో గిరిప్రదక్షిణ వైభవంగా జరిగింది. ఉదయం స్వామి అమ్మవార్లకు పల్లకీ సేవ చేపట్టారు. మధ్యాహ్నం గిరిప్రదక్షిణ నిర్వహించగా భక్తులు భారీగా హాజరయ్యారు.

జ్వాలాతోరణం

సత్యరథం వెనుక గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వేడుకగా సత్యదేవుడి గిరిప్రదక్షిణ

- సత్యదేవ నామస్మరణతో మార్మోగిన రత్న, సత్యగిరులు
- ఉదయం పల్లకీ సేవ
- మధ్యాహ్నం సత్యరథం వెంబడి గిరియాత్ర
- గిరిప్రదక్షిణలో పాల్గొన్న లక్షా50వేల మంది భక్తులు
- సాయంత్రం ఘనంగా పంపా హారతులు
- వేడుకగా జ్వాలాతోరణం

7

ఎన్టీఆర్ వైద్య సేవ నెట్వర్క్ ఆసుపత్రుల ద్వారా

మెరుగైన వైద్య సేవలు

రోగుల నుంచి వచ్చిన 14 ఫిర్యాదులు పరిష్కారం: కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎన్టీఆర్ వైద్య సేవ నెట్వర్క్ ఆసుపత్రుల ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ క్రమశిక్షణ కమిటీ సభ్యులు పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఎన్టీఆర్ వైద్య సేవ క్రమశిక్షణ కమిటీ సభ్యుల సమావేశం కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ నెట్వర్క్ ఆసుపత్రులకు సంబంధించి 14 ఫిర్యాదులు అందాయన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ అర్హత ఉన్నప్పటికీ యజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా రోగుల నుంచి సొమ్ములు తీసుకున్నారన్నారు. తిరిగి వాటిని ట్రస్టు నుంచి ఆసుపత్రులకు చెల్లించామన్నారు. ఆసుపత్రులకు చెల్లించిన సొమ్మును రోగులకు తిరిగి ఇప్పించామన్నారు. ఆసుపత్రుల యజమన్యాలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా మొదటి తప్పుగా భావించి ఎటువంటి జరిమానా విధించలేదన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ నెట్వర్క్ ఆసుపత్రులు రోగులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ఆరోగ్య బీమా పథకం ద్వారా తెల్లరేషన్‌కార్డు కలిగిన కుటుంబాలు ఆరోగ్య భద్రత, ఆరోగ్య పరిరక్షణలపై ప్రత్యేక దృష్టి సారించాలని సభ్యులు సూచించారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా పేదలకు సార్వత్రిక ఆరోగ్య కవరేజీని సంపూర్ణంగా అందించాలన్నారు. వైద్య పరీక్షల నిర్వహణ, స్క్రీనింగ్, రోగ నిర్ధారణ, చికిత్స ఫాలో అప్, క్లెయిమ్ చెల్లింపు వరకు మొత్తం ప్రక్రియలో ఎటువంటి దుర్వినియోగానికి, మోసానికి తావులేకుండా ఆన్‌లైన్ వెబ్ ఆధారిత ప్రాసెసింగ్ ద్వారా వైద్య సేవలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, నెట్‌వర్క్ ఆసుపత్రులు నిరక్షరాస్యులైన రోగులకు సౌకర్యాలు కల్పించడానికి వైద్య మిత్రులతో నిర్వహించే హెల్ప్‌డెస్కుల సహాయంతో నాణ్యమైన వైద్య సేవలు పొందాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ కార్తీక్, ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా సమన్వయ అధికారి రాధాకృష్ణ, జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖాధికారి సీహెచ్‌వీ భరతలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



ముమ్మిడివరంలో వసూళ్ల రాజాలు దోపిడీకి తెరదీశారు. వార్డు స్థాయి ప్రజా ప్రతినిధుల్లో కొందరు సచివాలయ ప్లానింగ్ ఉద్యోగులతో కలిసి భవన నిర్మాణదారుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు.

ముమ్మిడివరంలో వసూళ్ల దందా బెంబేలెత్తుతున్న భవన నిర్మాణదారులు

ముమ్మిడివరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో ఇంటిపై మరో అంతస్తు నిర్మించుకోవాలన్నా.. కనీసం రేకులతో షెడ్డు వేసుకోవాలన్నారు.. ఉన్న ఇంటికి మరమ్మతులు చేసుకోవాలన్నా.. టౌన్ ప్లానింగ్ అప్రూవల్ ఫీజు కన్నా అక్రమ వసూళ్ల ఫీజే ఎక్కువగా ఉంటోంది. టౌన్ ప్లానింగ్ అప్రూవల్ తీసుకోకుండా భవన నిర్మాణం, రేకుల షెడ్డు పనులు చేపడితే సదరు యజమానులు జేబులు ఖాళీ చేసుకోవాల్సిందే. వార్డుల్లో ఎవరు కట్టడాలు చేపడుతున్నారు అనే దానిపై కొందరు వార్డు స్థాయి ప్రజాప్రతినిధులు నిఘా పెడుతున్నారు. ఆ సచివాలయ పరిధిలో ప్లానింగ్ అధికారుల ద్వారా వారికి హెచ్చరికలు జారీ చేస్తారు. వారు అడిగినంతా కప్పం చెల్లించకపోతే అధికారులు హడావిడి చేసి నిర్మాణ పనులను అర్ధంతరంగా నిలిపివేస్తున్నారు. రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఇంటి నిర్మాణదారులు గగ్గోలు పెడుతున్నారు. వీరికి జడిసి సెలవు రోజుల్లో నిర్మాణ పనులు చేపడుతున్నారంటే వసూళ్ల దందా ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఈ అక్రమ వసూళ్లు టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులకు మాత్రమే పరిమితమయ్యేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది వార్డు స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల స్థాయికి చేరింది. దందా విషయలో అధికార, ప్రతిపక్ష పార్టీ అన్న తేడా లేదు. ఈ వ్యవహారం రోడ్డుకెక్కడంతో బాధితులు స్థానిక ఎమ్మెల్యేకు కూడా ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దీనిని ఎమ్మెల్యే కూడా నిరోధించలేకపోవడంతో కొందరు అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సెల్‌లో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ దందాకు అడ్డుకట్ట వేయకపోతే పార్టీకి చెడ్డపేరు వస్తుందని అధికార పార్టీలోని నాయకులు, కార్యకర్తలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.



కార్తీక పౌర్ణమి పూజలు చేస్తున్న మహిళలు

ద్రాక్షారామ... దేదీప్యమానం

భీమేశ్వర స్వామికి భక్తుల ప్రత్యేక పూజలు... సప్త గోదావరికి పున్నమి హారతి

ద్రాక్షారామ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో బారులు తీరి భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నవవధువులు స్వామివారికి పువ్వు, పిందె సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక అభిషేకాలు జరిపారు. అశ్వత్థనారాయణ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉసిరి చెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక నోము ఆచరించిన మహిళా భక్తులు రాత్రి ఆలయంలో దీపాలు వెలిగించారు. ఈవో అల్లు వెంకట దుర్గాభవాని పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు సేవలు అందించారు. అన్నప్రసాద భవనంలో అన్నదానం జరిపారు. ఫైండావారి సత్రంలో అన్నదానం యథావిధిగా జరిగింది.

భీమేశ్వరస్వామివారి కొలను సప్త గోదావరికి పున్నమి హారతిని శుక్రవారం రాత్రి మనోహరంగా నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు, వేదపండితులు సప్త గోదావరికి శ్రీసూక్త విధానంలో పూజలు జరిపారు. సప్త గోదావరికి పసుపు, కుంకుమ, గాజులు, చీర, రవికె, పుష్పాలు సమర్పించారు. అనంతరం వేదమంత్రాల మధ్య ఏక హారతి, నేత్ర హారతి, బిల్వ హారతి, నాగ హారతి, నంది హారతి, త్రిశూల హారతి, సింహ హారతి, నక్షత్ర హారతి, కుంభ హారతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



పున్నమి హారతిని తిలకిస్తున్న భక్తులు

ధాన్యం సొమ్ము 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ

జాయింట్ కలెక్టర్ నిషాంతి



అమలాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లో వారి ఖాతాల్లో సొమ్ము జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ధాన్యం ప్రక్రియలో అత్యంత ముఖ్యమైన గోనెసంచులు, హమాలీ కార్మికులు, ధాన్యం రవాణా విషయంలో ఆరుగాలం శ్రమించి పండించిన రైతులకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పౌరసరఫరాల శాఖ రేయింబవళ్లు అండగా ఉంటోందన్నారు. ఇచ్చిన ధాన్యానికి 48 గంటల్లో సొమ్ములు పడతాయనే భరోసా ఇచ్చినా అంతకన్నా ముందుగానే కేవలం 12 నుంచి 18 గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో జమవుతోందని జేసీ తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ నిషాంతి ఒక ప్రకటనలో సూచించారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు... 8లో



శివలింగం రూపంలో దీపాలంకరణ

సాగర తీరం... దీప శోభితం

అంతర్వేదిలో భక్తుల పుణ్య స్నానాలు... శివాలయాల్లో పూజలు, అభిషేకాలు

అంతర్వేది, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు సముద్ర, నదీ పుణ్య స్నానాలు ఆచరించారు. అంతర్వేది క్షేత్ర పాలకుడు పార్వతి సమేత నీలకంఠేశ్వర స్వామి, గుడిమూల కృతకృత్య రామలింగేశ్వర స్వామి, మోరి సీతారామలింగేశ్వర స్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం దీపోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు నిత్యాన్నదానంలో ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం సాగరసంగమ తీరాన లైట్‌హౌస్, బీచ్ వద్ద భక్తులు, పర్యాటకులు సందడి చేశారు.



నీలకంఠేశ్వర స్వామి ఆలయం ఎదుట జ్వాలాతోరణం

కంప్యూటరీకరణతో సహకార సంఘాల సేవల్లో పారదర్శకత

ముమ్మిడివరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య బ్యాంకుల తరహాలో సహకార సంఘాల్లో సేవలను పారదర్శకతతో వేగవంతంగా అందించేందుకు కంప్యూటరీకరణ చేయనున్నట్టు జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ పేర్కొన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా ముమ్మిడివరం పీఏసీఎస్ కార్యాలయ భవనంలో డివిజనల్ సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు అధ్యక్షతన నూతన ఆవిష్కరణ, సాంకేతిక, సూపరిపాలన అంశాలపై శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సహకార సంఘాల కంప్యూటరీకరణతో రైతులకు పూర్తి పారదర్శకతతో కూడిన సేవలు అందించడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రైతులు, సహకార సంఘ సభ్యులు వారోత్సవాల సదస్సులకు హాజరయ్యేలా చూడాలన్నారు. ఇక్కడ ఇచ్చే సలహాలు, సూచనలను గ్రహించి సభ్యుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. వారోత్సవాల ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు... సహకార ఉద్యమ చరిత్రను వివరించి సభ్యులతో సహకార ప్రతిజ్ఞ చేయించారు. సొసైటీల సేవలను ఏ విధంగా వినియోగించుకోవాలో వివరించారు. సబ్ డివిజనల్ సహకార అధికారి వి.వెంకట నారాయణ... సొసైటీల పనితీరు, సంఘాలు చేస్తున్న వ్యాపార లావాదేవీలను రైతులకు వివరించారు. ఏఈవో పి.కృష్ణయ్య, వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలను వివరించారు. సొసైటీ సీఈవో మట్టపర్తి జయరాం, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ


గోదారంతా జనం : కిటకిటలాడిన రాజమహేంద్రవరం పుష్కరఘాట్


రాజమహేంద్రవరం గోదావరిలో దీపాలు వదులుతున్న మహిళ


పోటెత్తిన భక్తజనం : ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో భక్తుల క్యూ

నోము పండించవా స్వామి: కార్తీక నోములకు స్వయంపాక దానాలతో ఆలయాలకు చేరుకున్న నవ వధువులు


సామర్లకోట భీమేశ్వరాలయంలో..


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో..


ఐ.పోలవరం వీరేశ్వరస్వామి ఆలయంలో..


పాదగయ క్షేత్రంలో పున్నమి కాంతులు


చూడు..స్వామి : ప్రత్యేక అలంకరణలో సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి

శివయ్యా.. చూడయ్యా

- కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం.. చేర నీ పాద దీపం కర్పూరదీపం..అంటూ భక్తులు దీపాలు వదిలారు.. నీ నోము నోచుకుంటున్నాం.. మమ్మల్ని చల్లంగ చూడు స్వామి అంటూ భక్తులు మొక్కు కున్నారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా శైవక్షేత్రాలు.. గోదావరి రేవులు భక్తజనంతో కిటకిటలా డాయి.. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు పుణ్యక్షేత్రాలు, నదీతీరాలకు చేరుకున్నారు.. ఆకాశంలో చుక్క కనుపడుతుం డగానే దీపాలు వదలాలని..తెల్లవారుజామునే ఆకాశానికి చూపిస్తూ కార్తీక దీపాలు విడిచిపెట్టారు.. శైవక్షేత్రాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు గోదావరి తీరంతోపాటు పిఠాపురంలోని కోనేరు, సామర్లకోట, ద్రాక్షారామల్లోని భీమేశ్వరాలయాలో మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు. బ్రాహ్మణులకు దీపదానం చేశారు.. శక్తిమేరకు స్వయంపాకం ఇచ్చారు. కార్తీక నోము సందర్భంగా ఆయా ఆలయాల్లో నూతన వధువులు కందపిలకలు.. పసుపు మొక్కలతో కూడిన స్వయంపాక దానాలతో కనిపించారు.


వరరామచంద్రాపురం మండలం రేఖపల్లి శివాలయంలో దీపారాధన


సామర్లకోటలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న భక్తజనం


భక్తజనంతో నిండిన కొవ్వూరు గోష్పాదక్షేత్రం


పిఠాపురం పాదగయలో శివుడికి అభిషేకం చేస్తున్న భక్తజనం


గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయం ఆలయ శిఖరంపై దర్శనమిస్తున్న పౌర్ణమి చంద్రుడు..
(ఇన్‌సెట్‌లో) పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఆలయ శిఖరంపై పౌర్ణమి చంద్రుడు

ఆలయ శిఖరాన పౌర్ణమి చంద్రుడు

గొల్లప్రోలు రూరల్/పిఠాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆలయ శిఖరాలపై పౌర్ణమి చంద్రుడు దర్శనమిచ్చాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో రాజగోపురం, ఆలయ శిఖరంపై చంద్రుడు దర్శనంతో భక్తులు భక్తతన్మయత్వంతో తిలకించి పూజలు చేశారు. కార్తీకపౌర్ణమి రోజున చంద్రదర్శనం కావడంతో భక్తులు పులకించారు. ఏటా కార్తీకపౌర్ణమికి ఆలయ శిఖరంపైకి చంద్రుడు వస్తాడని అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు తెలిపారు. పాదగయ క్షేత్రంలోని ఆలయ శిఖరంపై పౌర్ణమి చంద్రుడు నిండుగా దర్శనమిచ్చాడు.



వృద్ధులకు.. ఆర్టీసీ రాయితీ

60 ఏళ్లు దాటితే 25 శాతం వర్తింపు

- ఆరు రకాల గుర్తింపు కార్డులు
- రాష్ట్రాలతో సంబంధం లేదు
- ఏ రాష్ట్రమైనా అమలు
- డిజిటల్ గుర్తింపు కార్డుకు ఓకే
- విడుదలైన ఉత్తర్వులు
- సీనియర్ సిటిజన్స్ ఆనందం

పెద్దాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటి జన్స్‌కు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) గుడ్‌న్యూస్ చెప్పింది. 25 శాతం రాయితీ అమలుకు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాయితీ అమలుకు ఆరు రకాల గుర్తింపు కార్డులను ప్రకటించింది. వాటిలో ఏఒక్కటి చూపించినా 25 శాతం సీనియర్ సిటిజన్స్‌కు రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేసింది. రాష్ట్రంతో సంబంధం లేకుండా ఏ రాష్ట్రానికి చెందిన సీనియర్ సిటిజన్స్‌కైనా ఈ రాయితీ వర్తింపచేయాలని ఏపీఎస్‌ఆర్టీసీ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఆర్టీసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

డిజిటల్ గుర్తింపు కార్డుకూ ఓకే..

సీనియర్ సిటిజన్స్ తమ వయస్సుకు సంబంధించిన హార్డ్ కాపీలు లేదంటే సాఫ్ట్‌కాపీల్లో ఏవి చూపించినా వాటిని అనుమతించాలని ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ నిర్వహించే అన్ని రకాల బస్సుల్లో 60ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్స్‌కు కార్పొరేషన్ 25శాతం రాయితీని పొడిగించిందని ఆదేశాల్లో పేర్కొన్నారు.ఇంకా టికెట్ కొనుగోలు సమయం, వారి ప్రయాణ సమయంలో సీనియర్ సిటిజన్ నుంచి భౌతిక రూపంలో లేదా డిజిటల్ రూపంలో (హార్డ్ కాపీ లేదా సాఫ్ట్ కాపీలు) వయస్సుకు సంబంధించిన ప్రభుత్వ గుర్తింపు కార్డులను చూపిస్తే సరిపోతుంది. సీనియర్ సిటిజన్స్ బస్సుల్లో 25 శాతం రాయితీని పొందడానికి ఆరు రకాల కార్డుల్లో ఏదైనా ఉపయోగించుకోవచ్చని ఆదేశాల్లో పేర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన గుర్తింపు కార్డుల్లో ఏదైనా అనుమతిస్తామని అధికారులు చెబుతున్నారు.ఆధార్, ఓటరు కార్డు, సీనియర్ సిటిజన్ ఐడీ కార్డ్, పాస్‌పోర్టు, పాన్ కార్డు,రేషన్‌కార్డులను అనుమతించాలని సూచించారు.

ఆదేశాలు వచ్చిన మాట వాస్తవమే

సీనియర్ సిటిజన్స్‌కు 25శాతం రాయితీని ఆర్టీసీ ప్రకటించింది. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.ఆరు రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా చూపించి నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. గుర్తింపుకార్డులు భౌతికంగా చూపించినా, ఫోన్‌లో చూపించినా అనుమతిస్తాం.
-మనోహర్, ఆర్టీసీ డీఎం, కాకినాడ

24న రుడా చైర్మన్‌గా బీవీఆర్ ప్రమాణస్వీకారం

రాజమహేంద్రవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ(రుడా) చైర్మన్‌గా నియమితుడైన సీనియర్ టీడీపీ నేత, రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి (బీవీఆర్ చౌదరి) ఈనెల 24వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆ రోజు ఉదయం రాజమహేంద్రవరంలోని రుడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌తో కలిసి మంగళగిరిలోని పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేశారు. అంతకు ముందు రుడా చైర్మన్‌గా తనకు అవకాశం ఇచ్చినందుకు లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.తన బాధ్యతలు స్వీకరణ గురించి కూడా వివరించారు.


లోకేశ్‌కు మొక్కను అందజేస్తున్న బీవీఆర్

'పోసానిని అరెస్టు చేయాలి'

దేవరపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీనటుడు, వైసీపీ నాయకుడు పోసాని కృష్ణమురళీని అరెస్టు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.దేవరపల్లి మూడురోడ్ల సెంటర్ వద్ద ఆందోళన చేసి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సుబ్రహ్మణ్యానికి వినతి పత్రం అందజేశారు.పోసాని అరెస్టు చేయాలన్నారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనిల్, నల్లజర్ల అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, గన్నమని హరికృష్ణ, ముళ్ళపూడి దొరాజీచౌదరి ఉప్పులూరి రాంబాబు, కాకర్ల జగదీష్,బళ్లా సూర్యచక్రం,అడబాల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



వారింట..దీపం పెడుతున్నారు!

పిఠాపురం ఒత్తులు.. దేశమంతటా వెలుగులు..

కార్తీక మాసం కావడంతో లక్షలాది మంది భక్తజనం.. గోదావరి రేవులు.. శివాలయాలు.. ఉసిరి చెట్టు.. ఇలా ప్రతి పుణ్య ప్రదేశంలో పెద్ద ఎత్తున దీపాలు పెడుతుంటారు.. ఏదో ఒక షాపుల్లో ఒత్తులు కొనుగోలు చేస్తారు.. ప్రమిదలో నూనె వేసి వెలిగించేస్తారు.. అయితే ఆ ప్రమిదలో వెలుగుతున్న ఒత్తు ఎక్కడి నుంచి వస్తుందో మాత్రం ఎవరికి తెలియదు.. ఆ ఒత్తులు వచ్చేది మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పవన్ కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురం నుంచే.. ఒత్తుల తయారీనే వేలాది మంది మహిళలకు జీవనాధారం.కొన్ని గ్రామాల్లో ఏ ఇంటికి తలుపు తట్టినా ఒత్తులు చేస్తూ కనిపిస్తారు.. ఎందుకంటే వారింట దీపం పెట్టేది ఆ ఒత్తులే మరి..

- వేలాది మందికి ఒత్తులే ఆధారం!
- తయారీకేంద్రంగా పిఠాపురం
- ఒత్తులే కదా అని తీసిపారేయవద్దు
- కోట్లలో సాగుతున్న వ్యాపారం
- ఇతర రాష్ట్రాలకు భారీగా ఎగుమతులు



పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం.. చేర నీ పాద దీపం కర్పూరదీపం..కార్తీక మాసం వచ్చిందంటే దీపాలదే ప్రత్యేకం.. మహిళలు నిష్ఠగా తెల్లవారుజామునే నదుల్లో దీపాలు వదిలి పూజిస్తారు.. ఆ దీపాల్లో ఒత్తులు ఎక్కడి నుంచి వస్తున్నాయంటే టక్కున చెప్పడం కష్టమే. ఎందుకంటే దీపాలు వెలిగించడం తప్ప.. ఒత్తులు ఎక్కడి నుంచి వస్తున్నాయనేది ఆలోచించరు. ఈ ఒత్తుల తయారీ కేంద్రంగా కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం ఉంది. సాధారణ పువ్వు ఒత్తుల నుంచి లక్ష ఒత్తుల కుందె, కోటి వత్తుల దిండు కూడా తయారు చేస్తారు. ఒత్తుల్లోనూ పలు రకాలున్నాయి. ప్రమిదల్లో ఒత్తులను ఉంచి దీపాలను తయారు చేస్తున్నారు.



వేలాది మహిళలకు ఉపాధి

పిఠాపురం నియోజకవర్గం ఒత్తుల తయారీ కేంద్రంగా ఉంది. గొల్లప్రోలు పట్టణంలో 1500 మంది మహిళలు,పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లోని బి.ప్రత్తిపాడు, బోగాపురం, విరవ, విరవాడ, చేబ్రోలు, చెందుర్తి, తాటిపర్తి సహా మరో 20 గ్రామాల్లో మరో 2,500 మంది మహిళలు ఒత్తుల తయారీ ద్వారా ఉపాధి పొందుతున్నారు. వీరిలో కొందరు మహిళలు సొంతంగా ఇంటి వద్దే ఒత్తులు తయారు చేస్తున్నారు.వీళ్ల స్థానికంగా అమ్మకాలు చేపడతారు. మరికొందరు స్థానికంగా ఒత్తుల తయారీ యూనిట్లు ఏర్పాటు చేసిన వ్యాపారుల వద్దకు వెళ్లి పనిచేస్తున్నారు. ఈ వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు సైతం ఒత్తులను హోల్‌సేల్‌గా ఎగుమతి చేయడం గమనార్హం. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, కర్నాటక, గోవా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. గొల్లప్రోలుతోపాటు పిఠాపురం నియోజకవర్గం మొత్తం మీద కోట్లలో వ్యాపారం జరుగుతూ ఉంటుంది.

టన్ను దారం రూ.1.50 లక్షలు

ఒత్తుల తయారీకి వినియోగించే దారం తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి వస్తోంది. అక్కడ టన్ను దారాన్ని రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షల వరకూ కొనుగోలు చేస్తారు. అత్యంత నాణ్యత కలిగిన దారం రూ.1.50 లక్షల వరకూ ఉంది. ఇలా తెచ్చిన దారాన్ని యంత్రాల సహాయంతో వడికి ఒత్తులకు అనుగుణంగా తయారు చేస్తారు. వీటిని మహిళలు ఒత్తులుగా తయారు చేస్తారు. తయారీ యూనిట్ల నిర్వాహకుల నుంచి ఈ దారాన్ని తీసుకుని ఇళ్ల వద్ద ఒత్తులు తయారు చేసి ఇస్తారు. కొందరు వ్యాపారులు తమ వద్దే ఒత్తులను తయారు చేయిస్తున్నారు. సాధారణంగా దీపంలో ఒకటి లేదా మూడు ఒత్తులు వినియోగిస్తారు. వీటితో పాటు 365 వత్తులు, 1008 ఒత్తులు, 10008 ఒత్తులు, లక్ష ఒత్తుల కుందె, కోటి ఒత్తుల దిండును తయారు చేస్తారు. వత్తుల్లో పువ్వొత్తులు, అయ్యప్ప ఒత్తులు, శివ సహస్రనామ ఒత్తులు, శివ జ్యోతులు, శివ ఢమరుకం ఒత్తులు, అఖండ ఒత్తులు, ఆకాశ దీపాలు తదితర రకాలున్నాయి. మహిళలు చేతితో మాత్రమే తయారు చేయగల పువ్వు ఒత్తులకు డిమాండ్ అధికంగా ఉంటుంది. ఆలయాల్లో వీటి వినియోగం ఎక్కువ. చేతితోనే చేయాల్సి ఉండడంతో స్థానిక మహిళలకు ఆర్డర్ ఇచ్చి తయారు చేయించుకుంటారు.

రకరకాల ఒత్తులు..

కోటి ఒత్తుల దిండు మూడు కిలోల నుంచి 18 కిలోల బరువు ఉంటుంది.18 కిలోలు ఉన్న కోటి ఒత్తుల దిండును రూ.3 వేల నుంచి రూ.4,500 వరకూ విక్రయిస్తారు. సాధారణ 3-4 కిలోల కోటిఒత్తుల దిండు ధర రూ.500 నుంచి రూ.600 వరకూ ఉంటాయి. మిగిలిన వాటి ధరలకు వాటి నాణ్యత, సంఖ్య ఆధారంగా ఉంటుంది.దారం ఒడికి తయారు చేసిన ఒత్తులను ప్రమిదల్లో ఉంచి నెయ్యి లేదా దీపం నూనె వేసి ప్యాకింగ్ చేస్తారు. 365 ఒత్తులతో తయారు చేసే దీపం ప్రమిదకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.కోటి ఒత్తుల దిండు, లక్ష ఒత్తుల కుందెలను ఆర్డర్‌పై తయారు చేయించుకుంటారు. ప్రమిదల్లో ఒత్తుల పెట్టి తయారు చేసిన దీపాలకు ఇతర రాష్ట్రాల్లో అధికంగా డిమాండ్ ఉంది.



కిలో ఒత్తుల తయారీకి రూ.150



ఇంట్లో పనులు పూర్తి చేసుకుని ఒత్తులను తయారు చేస్తాం. కిలో పువ్వు ఒత్తులను తయారు చేసి ఇస్తే రూ.150 ఇస్తారు. ఇంట్లో పనిని బట్టి ఒత్తులు తయారీ ఆధారపడి ఉంటుంది. నాతో పాటు పలువురు మహిళలు ఇళ్లవద్దే ఒత్తులు తయారు చేస్తున్నారు. దీనివల్ల అదనపు ఆదాయం వచ్చి కుటుంబ పోషణలో ఉపయోగపడుతోంది. మా కుటుంబంలో ఇతర ఖర్చులకు సరిపోతాయి.
- రంగనాథం చంద్రకాంతం, ఈబీసీ కాలనీ, గొల్లప్రోలు

ఇక్కడ ఒత్తులకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్



మన దగ్గర తయారయ్యే ఒత్తులకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ ఉంది.ఆర్డర్ ఇచ్చి తయారు చేయించుకుంటారు. పువ్వు ఒత్తులతో పాటు 365 ఒత్తులు, 1008 ఒత్తులు, లక్ష ఒత్తుల కుందె, కోటి ఒత్తుల దిండులకు డిమాండ్ ఎక్కువ. ప్రమిదల్లో ఒత్తులు పెట్టి తయారు చేసే దీపాలను అధికంగా కొనుగోలు చేస్తారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత ఎక్కువమందికి ఉపాధి లభిస్తుంది. -మురాలశెట్టి బాబు, యూనిట్ నిర్వాహకుడు

వేడుకగా గిరిప్రదక్షిణ

- సత్యదేవ నామస్మరణతో మార్మోగిన రత్న, సత్యగిరులు
- ఉదయం పల్లకీ సేవ
- మధ్యాహ్నం సత్యరథం వెంబడి పాల్గొన్న లక్షా50వేలమంది

అన్నవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడు కొలువైన రత్న, సత్యగిరిలు శుక్రవారం జై సత్యదేవ నామస్మరణతో మార్మోగిపోయింది. కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన స్వామివారి గిరిప్రదక్షిణకు రాష్ట్ర నలుమూలలనుంచి లక్షా50వేల మంది విచ్చేయడంతో రోడ్డంతా భక్తులతో నిండిపోయింది.

ఈ ఏడాది నూతనంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్లను ఉదయం 8గంటలకు పల్లకిలో, సత్యరథం భక్తులతో మధ్యాహ్నం రెండు గంటలకు గిరియాత్ర ప్రారంభించారు. ఉదయం 7.30 గంటలకు కొండపై నుంచి స్వామి,అమ్మవార్లను పల్లకిలో మెట్లమార్గం గుండా కొండదిగువున తొలిపావంచా వద్దకు తోడ్కొనివచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్ స్వామి వారి పల్లకీ సేవ ద్వారా గిరిప్రదక్షిణ ప్రారంభించారు. స్వామి, అమ్మవార్లను పల్లకిలో పండితుల మంత్రోచ్ఛారణలతో స్వల్పంగా హాజరైన భక్తులతో ఈ గిరియాత్ర తొలిపావంచా నుంచి జాతీయ రహదారి మీదుగా బెండపూడి సమీపంలో పుష్కరకాలువ రోడ్డుగుండా 9.2 కిలోమీటర్లమేర గిరిప్రదక్షిణ సాగింది.



గిరిప్రదక్షిణలో సత్యరథం

గోవిందనామ స్మరణతో గిరిప్రదక్షిణ

మధ్యాహ్నం సత్యరథం ద్వారా ప్రదక్షిణకు భక్తులు సత్య, రత్నగిరికొండల వెంట నడిచారు. కొండలు, గుట్టలు దాటుకొని గోవిందనామ స్మరణల నడుమ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. లక్షా 50వేలమంది వరకు హాజరయ్యారు. దేవస్థానం, దాతల సహకారంతో పండ్లు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్ల స్టాల్స్ ఏర్పాటు చేసినా ఉదయం పాల్గొన్న భక్తులతో కొంత ఖాళీఅయ్యాయి. దేవస్థానం తరఫున 3లక్షల మంచినీరు ప్యాకెట్లను వీఆర్వో విభాగం అందుబాటులో ఉంచారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్ వాకీటాకీల ద్వారా సమాచారం తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. మార్గమధ్యలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలందించారు.

స్తంభించిన ట్రాఫిక్

గిరియాత్రకు తరలి వచ్చిన భక్తులతో ట్రాఫిక్ స్తంభించింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేపట్టారు. పంపాతీరం వద్ద ప్రదక్షిణయాత్ర ముగిసింది. ప్రత్యేక మండపంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి చతుర్వేద పండితుల వేదస్వస్తి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఉదయం స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

ఈ ఏడాది ముందు జాగ్రత్తలతో మధ్యాహ్నం గిరియాత్ర చేపట్టాలనే ఆలోచన సత్ఫలితాలు ఇచ్చాయి. ఆలయ ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ ఉదయం పల్లకీలో స్వామి,అమ్మవార్లకు మధ్యాహ్నం భక్తులతో సత్యరథం గిరియాత్ర చేపట్టారు. గిరియాత్ర విజయవంతంతో సిబ్బందిని ఈవో, ఛైర్మన్లు అభినందించారు. స్టాల్స్ ఏర్పాట్లు సూపరెంటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ పర్యవేక్షణలో తలుపులయ్య, గణపతి ఏర్పాటు చేశారు.

శోభాయమానంగా పంపా హారతులు

కార్తీకపౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి పంపా హారతుల కార్యక్రమం శోభాయామానంగా జరిగింది. రాత్రి 6.30 గంటలకు స్వామి,అమ్మవార్లను కొండపై నుంచి మేళతాలాలు, పండితుల మంత్రోచ్ఛారణల నడుమ పంటుపై ఆశీనులు గావించారు. నదీమతల్లికి పసుపు, కుంకుమ, చీర సమర్పించారు. అర్చకస్వాములు పంపానదికి ఏడు రకాలైన ఏకహారతి, నేత్రహారతి, బిల్వహారతి, సర్పహారతి, కుంభహారతి, నక్షత్ర హారతి, కర్పూరహారతి ఇచ్చారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనంతో ముగిసింది.ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్ పాల్గొనగా వైదికకార్యక్రమాలను ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి రుత్విక్‌లు చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి నిర్వహించారు.

జ్వాలాతోరణం ఇలా..



జ్వాలాతోరణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

కార్తీకపౌర్ణమి సందర్భంగా కొండదిగువున తొలిపావంచా వద్ద జ్వాలాతోరణం కార్యక్రమం వేడుకగా జరిగింది. పంపా హారతుల తరువాత స్వామి,అమ్మవార్లను తొలిపావంచా వద్దకు తోడ్కొనివచ్చారు. ఇరువైపులా ఎండుగడ్డితో తోరణాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అనంతరం అర్చకస్వాముల వేదమంత్రాల నడుమ తోరణానికి నిప్పంటించారు. వాటి మధ్యలో పల్లకీలో స్వామి, అమ్మవార్లను ముమ్మారు ప్రదక్షిణ చేయించారు. ఈ సందర్భంగా తోరణంనుంచి జ్వాల అనంతరం వెలువడిన భస్మం కోసం భక్తులు పోటీపడ్డారు. ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను జాతీయ రహదారి మీదుగా మళ్లించారు.



నింగి.. వంగి! నింగి వంగిందా..? అన్నట్టుగా ఆకాశంలో సప్తవర్ణాల హరివిల్లు కనిపిస్తోంది కదూ.. ప్రకృతిలో ఎన్నో అందాలు.. వాటిలో ఇంద్రధనస్సు అత్యద్భుతం.. కాకినాడ జిల్లా తేటగుంట హైవే వద్ద శుక్రవారం ఉదయం కనువిందు చేసిన ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది. -ఫొటోగ్రాఫర్, కాకినాడ

పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోవాలి

- డిసెంబరు 9 వరకు అవకాశం
- ఓటు దరఖాస్తుకు గెజిటెడ్ సంతకం అవసరం లేదు
- ఓటరు వెరిఫికేషన్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్ చూపించాలి
- కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఓటు నమోదుకు డిసెంబరు 9వతేదీ వరకు అవకాశం ఉందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఓటు నమోదుకు డిగ్రీ జిరాక్స్ పత్రాలను ఇచ్చే సమయంలో గెజిటెడ్ సంతకం అవసరం లేదన్నారు. ఓటరు వెరిఫికేషన్‌కు బీఎల్‌వోలు ఇంటికి వచ్చినప్పుడు తనిఖీ అధికారికి ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్‌ను చూపించాలన్నారు. లేనిపక్షంలో అప్పుడు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన జిరాక్స్ పత్రాన్ని ఇవ్వాలన్నారు. పదో తరగతి చదివిన తర్వాత ఇంటర్మీడియట్ చదవకుండా డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు కూడా ఓటు నమోదు చేసుకునేందుకు అర్హత ఉందన్నారు. ఈనెల 23న ఓటర్ల డ్రాఫ్ట్ పబ్లికేషన్ జరుగుతుందన్నారు. వచ్చేనెల 30న ఓటర్ల తుది జాబితా ప్రచురణ జరుగుతుందన్నారు. పట్టభద్రుల ఓటుకు ఇప్పటివరకు 2,96,643 దరఖాస్తులు వచ్చాయన్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 4064, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి 62,862, తూర్పుగోదావరి జిల్లానుంచి 58,561, ఏలూరుజిల్లానుంచి 41196, కాకినాడ జిల్లానుంచి 62200, పశ్చిమగోదావరి జిల్లానుంచి 67760 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులను పరిశీలించిన తర్వాత ఓటు నమోదు జరుగుతుందన్నారు.

విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించడం గొప్ప బాధ్యత

- నైతిక విలువల ప్రభుత్వ సలహాదారు చాగంటి
- మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర సమగ్ర శిక్ష పీడీ, ఆర్జేడీ

కాకినాడ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించడం గొప్ప బాధ్యతని నైతిక విలువల ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ ప్రతినిధిగా రాష్ట్రసమగ్ర శిక్ష పీడీ బి.శ్రీనివాసరావు, ఆర్జేడీ జి.నాగమణి శుక్రవారం చాగంటి దంపతులను కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలోని గోశాల సమీపంలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువల ప్రభుత్వ సలహాదారుడిగా తనను నియమించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. తన పదవీ కాలంలో విద్యార్థి లోకానికి సత్ప్రవర్తన, మంచి నడవడిక, నైతిక విలువలతో నేర్పే కర్తవ్యాన్ని తనకు అప్పగించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారని, త్వరలో విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌ను కలుస్తామని చెప్పినట్లు పీడీ శ్రీనివాసరావు తెలిపారు.



చాగంటి దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీడీ శ్రీనివాసరావు, ఆర్జేడీ నాగమణి

ఇక పుష్కలంగా ఉచిత ఇసుక

- వేమగిరి, తీపర్రు-3 రీచ్‌లను జిల్లాకు కేటాయించిన ప్రభుత్వం
- కాకినాడ రూరల్, పెద్దాపురం, గొల్లప్రోలుల్లో స్టాక్ యార్డులు
- 24 నుంచి ఇసుక అందుబాటులోకి..
- కాకినాడ రూరల్, పెద్దాపురంల్లో టన్ను ఇసుక రూ.600
- గొల్లప్రోలు యార్డులో టన్ను రూ.582
- కాకినాడ జిల్లా కలెక్టర్ వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి జిల్లాలో పుష్కలంగా ఇసుక లభించనుందని, కాకినాడ జిల్లాకు తూర్పుగోదావరి జిల్లాలోని వేమగిరి, తీపర్రు-3 రీచ్‌లను ప్రభుత్వం కేటాయించిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ వెల్లడించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర జిల్లా అయిన తూర్పుగోదావరి జిల్లాలోని కడియం మండలంలో ఉన్న వేమగిరి రీచ్‌ను, పెరవలి మండలంలో తీపర్రు-3 రీచ్‌ల్లో ఇసుక కాకినాడ జిల్లాకు కేటాయించారన్నారు. ఈ రీచ్‌ల్లో ఉన్న ఇసుకను కాకినాడ జిల్లాలో ప్రజల అవసరాల నిమిత్తం తరలించి తీసుకొస్తామన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కాకినాడ రూరల్, పెద్దాపురం, గొల్లప్రోలుల్లో ఇసుక స్టాక్ యార్డులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికోసం రీచ్ ఆపరేటింగ్ ఏజెన్సీలను ఖరారు చేశామన్నారు. ఇసుక స్టాక్ యార్డు నిర్వహణకు ఏజెన్సీల టెండర్లు పిలిచి ఈనెల 22తేదీకి లైసెన్సులు ఖరారు చేస్తామన్నారు. ఈ తర్వాత ఈనెల 24, 25 తేదీలకు స్టాక్ యార్డులలో ఇసుక అందుబాటులోకి వస్తుందన్నారు. వినియోగదారులు నిర్మాణాల నిమిత్తం ఇసుకను రీచ్‌లనుంచి గానీ, స్టాక్ యార్డుల నుంచి గానీ పొందవచ్చునన్నారు. ఇసుక తవ్వకం, రవాణా, నిల్వల నిర్వహణకు అయ్యే ఖర్చులను మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. టన్ను ఇసుకను కాకినాడ, పెద్దాపురం స్టాక్ యార్డుల్లో రూ.600గా, గొల్లప్రోలు యార్డులో రూ.582గా నిర్ణయించామన్నారు.

వినియోగదారులు నేరుగా ఇసుకను ఎస్ఎఎస్‌డీ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా ఏపీ శాండ్ మేనేజ్ మెంట్ సిస్టమ్ వెబ్‌పోర్టల్ నుంచి తమ ఆధార్ వివరాలతో బుక్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఇసుక బుక్ చేసుకునే విధానాన్ని ఆయన వివరించారు. ఆఫ్‌లైన్ అంటే స్వయంగా ఇసుక రీచ్‌ల దగ్గర నుంచిగానీ, ఇసుక స్టాక్ యార్డుల వద్దకు వెళ్లి తగిన సొమ్ములు చెల్లించి ఇసుకను పొందవచ్చునన్నారు. తీపర్రులో లోడింగ్ చార్జీలు టన్నుకు రూ.96, వేమగిరిలో లోడింగ్ చార్జీలు టన్నుకు రూ.61.30 అవుతుందన్నారు. లోడింగ్, రవాణా, స్టాక్‌యార్డు సెక్యూరిటీ, సీసీ కెమేరాల నిర్వహణ వంటికి అన్నింటికి వ్యయం అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో టన్ను రూ.600లకు రెండు యార్డులలో, టన్ను రూ.582కి ఒక యార్డులో వినియోగదారులకు లభిస్తుందన్నారు. జిల్లాలో భవన నిర్మాణాలు, రోడ్లు నిర్మాణాలు, ఇతర నిర్మాణాలు నిలిచిపోకుండా ఉండాలనే లక్ష్యంతో ఉచిత ఇసుకను అందుబాటులోకి ప్రభుత్వం తెచ్చిందన్నారు. ఇసుక పొందే క్రమంలో ఏమైనా ఇబ్బందులుంటే తమను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, సమాచారశాఖ డీడీ నాగార్జున పాల్గొన్నారు.

భక్తజనసంద్రంగా సత్యదేవుడి సన్నిధి

- రూ.1.20 కోట్లు ఆదాయం



ఆలయంలో వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పౌర్ణమి సందర్భంగా సత్యదేవుడి సన్నిధి శుక్రవారం భక్తజనసంద్రంగా మారింది. స్వామివారి దర్శనానికి గురువారం రాత్రికే చేరుకున్న భక్తులకు 10గంటలకు వ్రతం టిక్కెట్లు విక్రయించి 12:30కి వ్రతాలు ప్రారంభించారు. ఒకపక్క గిరిప్రదక్షిణకు హాజరైన భక్తులు, స్వామివారి వ్రతమాచరించేందుకు విచ్చేసిన భక్తులతో ఎక్కడ చూసినా భక్తజన సమూహమే కనిపించింది. కార్తీకపౌర్ణమి రోజున స్వామివారికి వివిధ విభాగాల ద్వారా రూ.1.20కోట్ల ఆదాయం లభించింది. అధికారులు చేపట్టిన ముందస్తుచర్యలు సత్ఫలితాలనిచ్చాయి. శుక్రవారం ఒక్కరోజు 9,995 వ్రతాలు జరిగాయి. ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం భక్తులు క్యూలైన్‌లో వేచియున్నారు.

కేన్సర్ వ్యాధి తాళలేక మహిళ ఆత్మహత్య

- కాలువలో దూకి బలవన్మరణం
- తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో ఘటన



కాలువలో మృతదేహం

బిక్కవోలు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధి తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలోని బిక్కవోలులోని పిండాల రేవులో కొట్టుకు వస్తున్న ఒక మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ కనుగొన్నారు. మృతదేహాన్ని బయటికి తీసుకువచ్చి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో మృతురాలి కుమార్తె వచ్చి తనతల్లి బుద్దాల నాగశ్రీ(50) రెండేళ్లుగా కేన్సర్‌తో బాధ పడుతోందని, రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నామని తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది తనకు చివరిసారిగా ఫోన్ చేసి అన్నయ్యను జాగ్రత్తగా చూసుకోమని ఫోన్ చేసి పెట్టేసిందని, ఇంటికి వెళ్లి చూడగా ఆమె కనిపించలేదని, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదని చెప్పింది. బిక్కవోలు పిండాల రేవు వద్ద ఒక మృతదేహం ఉందని తెలిసి రావడంతో ఆమె తన తల్లిగా గుర్తించింది. దీంతో పోలీసులు మృతదేహానికి అనపర్తి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టమ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



గోకవరం పోలీస్‌స్టేషన్‌లో మొక్కనాటుతున్న ఐజీ అశోక్‌కుమార్

కోరుకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జూదాలు, గంజాయి, ఇతర అసాంఘిక కార్యకలాపాలు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన నార్త్‌జోన్‌పరిధిలోని తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ, గోకవరం పోలీస్‌స్టేషన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు పెద్దఎత్తున జరగాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలే కాకుండా ప్రైవేట్ వ్యక్తులను ప్రోత్సహించి ఎక్కువ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జూదాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపట్ల స్థానిక పోలీసులు సరిగా స్పందించకపోతే స్పెషల్ ప్రొటెక్షన్ టీంలు రంగంలోకి దిగుతాయన్నారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులు కేసులు నమోదు చేస్తే స్థానిక పోలీసులపై చర్యలు తీసుకుంటామన్నారు. జూదాలు, పేకాట, కోడిపందేలు, గంజాయి రవాణా, ఇతర మాదక ద్రవ్యాల రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేస్తామన్నారు. ఐజీ వెంట జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, నార్త్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ టి.దేవకుమార్, సీఐ వై.సత్యకిషోర్, ఎస్ఐ టి.శ్యామ్‌సుందర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

పాలంగిలో చండీహోమం, రుద్రయాగం

- పాల్గొన్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

ఉండ్రాజవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని పాలంగి గ్రామంలో నెలటూరుకు చెందిన ఉమారామలింగేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి 15వరకు అష్టవాజపేయ మహాయాగం సందర్భంగా జరిగిన చండీహోమం, రుద్రయాగ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆఖరి రోజైన శుక్రవారం పాల్గొన్నారు. కుంకుమ పూజలు, దీపోత్సవం నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల కార్యక్రమంలో పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు. యాగ నిర్వాహకుడు జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలు అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి

వ్యక్తి ఆత్మహత్య

శృంగవరపుకోట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా ఎస్.కోట పట్టణంలోని శ్రీనివాసకాలనీలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం నార్కేడిమిల్లి గ్రామానికి చెందిన సీహెచ్ నాగేంద్ర శ్రీనివాస కాలనీలో ఉంటున్నాడు. అతని భార్య గర్భవతి కావడంతో పుట్టింటికి వెళ్లింది. కొన్నాళ్లుగా ఆయన ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. నాగేంద్ర భార్య శుక్రవారం ఉదయం నుంచి ఫోన్ చేస్తున్నా లిఫ్ట్ చేయకపోవడంతో ఎస్.కోటలో వేరేచోట ఉన్న బంధువులకు చెప్పింది. దీంతో వారు ఇంటికి వచ్చి పిలిచారు. తలుపులు కొడితే తెరవలేదు. కిటికిలో నుంచి చూస్తే నాగేంద్ర ఉరేసుకుని కనిపించాడు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వీఎస్ మూర్తి తెలిపారు. భార్య, అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు.

పట్టువస్త్రాలు పంపిన డిప్యూటీ సీఎం పవన్

- పాదగయ, మహాసంస్థానంలో సమర్పణ... ప్రత్యేక పూజలు

పిఠాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వామి,అమ్మవార్లకు, శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పట్టువస్త్రాలు సమర్పించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రజలంతా శాంతి, సౌభాగ్యాలతో సుభిక్షంగా ఉండాలని... రాష్ట్రానికి, పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు మంచి జరగాలని కోరుకుంటూ ఆయన ఈ పట్టువస్త్రాలను ప్రత్యేకంగా పంపారు. పవన్ పంపిన పట్టువస్త్రాలను పాదగయక్షేత్రంలో స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీ దేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికాఅమ్మవార్లకు జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, పండ్లు సమర్పించారు. వాటిని స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు పవన్ పంపిన పట్టువస్త్రాలను మర్రెడ్డి శ్రీనివాసరావు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజలు నిర్వహించి వాటిని స్వామికి అలంకరించారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన పట్టువస్త్రాలను తీసుకువెళ్తున్న జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు



పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో పవన్ పంపిన పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న మర్రెడ్డి శ్రీనివాసరావు

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన
మామిడికుదురు, నవంబరు15(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయం వద్ద శుక్రవారం గ్రంథాలయ అధికారి ఎ.సూర్యనారాయణ, బీడీసీ యెరుబండి కన్నబాబు ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థినీ విద్యార్థులు పుస్తకాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన
ముమ్మిడివరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ముమ్మిడివరం శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పలు పుస్తకాలను లైబ్రరియన్ శీలం నాగరాజు గ్రంథాలయంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు


శిక్షణలో మాట్లాడుతున్న డీపీవో శాంతలక్ష్మి

● గ్రామాల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై శిక్షణ

అమలాపురం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి పంచాయతీలు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి కోరారు. పంచాయతీల ఆదాయంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులను సక్రమంగా వినియోగించుకునేలా ముందస్తు ప్రణాళిక తప్పనిసరన్నారు. దీనికి సంబంధించి శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఆర్థిక సంఘం నిధులతో పాటు ఉపాధి హామీ నిధులు గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడతాయన్నారు. ఎంపీడీవో ఉండ్రు బాబ్జీ, ఈవోపీఆర్డీ బి.మంగాదేవి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధిపై ప్రణాళికల తయారీలో అన్ని శాఖల నిధులు, పథకాలను పరిగణలోకి తీసుకోవాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఈవోపీఆర్డీ యు.నాగేంద్ర, ఏపీఎం సయ్యద్, పంచాయతీల కార్యదర్శులు ఎస్.రాజమోహన్, ఎస్.దుర్గాశ్రీనివాస్, జ్యోతి, శిరీష, వీరబాబు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులతో పాటు పంచాయతీ ఆదాయం, ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవడం తప్పనిసరి అని జిల్లా పంచాయతీ అధికారిణి శాంతలక్ష్మి అన్నారు. పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని వివిధ అంశాలపై కార్యదర్శులు, డ్వాక్రా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీడీవో రాజ్‌కుమార్, ఆర్‌పీ భీమేశ్వరి, పాలనాధికారి ఎంఎల్ఎన్‌మూర్తి శిక్షణ ఇచ్చారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): గ్రామసభల్లో ప్రజల అవసరాలను గుర్తించి సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని శాంతలక్ష్మి పేర్కొన్నారు. ముమ్మిడివరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామాల అభివృద్ధి ప్రణాళిక రూపొందించడంపై ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచారి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు, మండల స్థాయి అధికారులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి ప్రణాళిక రూపొందించడంలో మండల స్థాయి అధికారులను భాగస్వామ్యం చేయాలన్నారు. పన్నులను సకాలంలో వసూళ్లు చేసి పంచాయతీలకు ఆదాయం పెంచేందుకు కృషి చేయాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి పనులు గుర్తింపుపై శిక్షణ ఇచ్చారు. ఈవోపీఆర్డీ సీహెచ్.లక్ష్మికల్యాణి, ఎ.ఎస్.శ్రీనివాస్, పంచాయతీ డీఈ పి.వి. శ్రీనివాసరావు, ఎంఈవో ఆర్.ఉదయభాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై గ్రామస్థాయిలో శాఖలు వారీగా సంబంధిత సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో కేవీ ప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖలకు సంబంధించిన సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి ప్రణాళికలో విద్య, వైద్య, వ్యవసాయం, పశుసంవర్థక శాఖ, మహిళా శిశుసంక్షేమం తదితర శాఖలు బడ్జెట్ రూపకల్పనలో భాగాస్వామ్యం కావాలన్నారు. అనంతరం గ్రామాభివృద్ధిపై పలు అంశాలపై శిక్షణా రూపంలో సిబ్బందికి ఎంపీడీవో అవగహన కల్పిచారు. ఈవోపీఆర్డీ జి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యాన్ని వారసత్వ సంపదగా అందించాలి


సాహితీ సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాస్

అమలాపురంరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యాన్ని భవిష్యత్ తరాలకు వారసత్వ సంపదగా అందించేందుకు తెలుగువారంతా కృషి చేయాలని మహారాష్ట్ర ఆకాశవాణి కేంద్రం ఇంజనీర్ ఆర్‌వీఎస్ఎస్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మాతృ భాష అమృతతుల్యమని, బాల్యం నుంచే పిల్లలకు మాతృబాష పట్ల ఆసక్తి, అభిరుచి కలిగించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన, ఉపాధ్యాయులపైన ఉందన్నారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రిన్సిపాల్ నూకల శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సాహితీ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసంగిస్తూ ఇతర భాషల్లో ప్రావీణ్యం పొందాలంటే మాతృభాషను పరిపూర్ణంగా అభ్యసించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య పురస్కార గ్రహీత, తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి మాట్లాడుతూ మాతృమూర్తి, మాతృభాష సర్వదా ప్రాతఃస్మరణీయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు పెమ్మరాజు గోపాల్, డాక్టర్ కేటీ పద్మజ మాతృభాష విశిష్టతను వివరించారు. అతిథి శ్రీనివాస్‌ను కళాశాల తరఫున సత్కరించారు.

రూ.2లక్షల విలువైన ఆభరణాల చోరీ
అమలాపురంటౌన్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): అమలాపురం భూపయ్యాగ్రహారంలో చల్లా సత్యనారాయణమూర్తి ఇంట్లో గురువారం రాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. రూ.2లక్షలు విలువైన ఆభరణాలు చోరీకి గురయ్యాయని సీఐపి.వీరబాబు తెలిపారు. మూర్తి కుటుంబ సభ్యులు మొదటి అంతస్తులో నిద్రించారు. క్రింది ఫ్లోర్‌లో తలుపునకు బోల్ట్ సరిగా బిగించలేదు. దీంతో చోరులు సులువుగా ఇంట్లోకి ప్రవేశించి ఆరు కాసుల బంగారు, కిలోన్నర వెండి ఆభరణాలు అపహరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు





ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామివారు, కార్తీక దీపోత్సవంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు, ఉప్పలగుప్తం: భీమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, ముమ్మిడివరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఐ.పోలవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణిమ సందర్భంగా మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. నవ వధువులు సంప్రదాయ రీతిలో కార్తీక నోములు తీర్చుకున్నారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలాచరించిన భక్తులు వీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వీరేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 184మంది భక్తులు గోత్రనామాలతో భద్రకాళీ అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్తీక పౌర్ణిమ సందర్భంగా వీరేశ్వరాలయంలో శుక్రవారం రాత్రి కార్తీక దీపోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన దీపోత్సవంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం వీరేశ్వరుని నిత్యకల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో మహిళలు కార్తీక దీపోత్సవంలో పాల్గొని దీపాలు వెలిగించారు. శూలాల సంబరం వైభవంగా జరిగింది. అనంతరం జ్వాలాతోరణ నిర్వహించారు.



ఐ.పోలవరం: మురమళ్లలో, పి.గన్నవరంలో జ్వాలాతోరణం

భక్త జనం పూజలు
కాట్రేనికోన, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరంలో కార్తీక పూర్ణిమ సందర్భంగా శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. వృద్ధ గౌతమినదిలో స్నానాలాచరించి గోదావరి మాతను పూజించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన అన్న సమారాధనలో 2000మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎస్ఐ అవినాష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో త్సవటపల్లి నాగు, నంద్యాల వెంకటేశ్వరరావు, గంగుమళ్ళ భద్రరావు, మోటిపల్లి శ్రీను, సలాది సతీష్, చిక్కం ఆనందకుమార్, అడపా శివ, అడపా వెంకటేశ్వరరావు, గంగుమళ్ళ శంకర్, మీసాల బాలచంద్రరావు పాల్గొన్నారు. చెయ్యేరు, పి.లక్ష్మివాడ, ఉప్పూడి, కాట్రేనికోన, నడవపల్లి, గెద్దనపల్లి, కందికుప్ప, పల్లంకుర్రు, మగాసానితిప్పలలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

జ్వాలాతోరణ ఉత్సవం
ఉప్పలగుప్తం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం రాత్రి శివాలయాల వద్ద జ్వాలాతోరణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా గొల్లవిల్లి మాణిక్యాంబాసమేత భీమేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణ వేడుకను యువత ఆధ్వర్యంలో నిర్వహించారు. బాణసంచా కాల్చి దీపోత్సవం జరిపారు. జ్వాలాతోరణం పంచుకునేందుకు గొల్లవిల్లి, వాడపర్రు గ్రామాల రైతులు పోటీపడ్డారు. ఉత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అందరికీ ప్రసాద వితరణ జరిగింది. కాగా ఆలయంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి, పూజలు చేశారు.

ఆలయాల్లో పూజలు
అల్లవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎన్.రామేశ్వరం, బోడసకుర్రు, గోడి, కొమరగిరిపట్నం, అల్లవరం, యెంట్రుకోన, దేవగుప్తం, లక్ష్మణేశ్వరం, బెండమూర్లంక గ్రామాల్లో శివాలయాల వద్ద జ్వాలాతోరణం నిర్వహించారు. మహిళలు, భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

భక్తులతో ఆలయాలు కిటకిట
ముమ్మిడివరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయానే నదిస్నానాలు ఆచరించి పూజలు జరిపించారు. ఉదయం నుంచి భక్తులు ఉపవాసాలు ఆచరించి నోములు తీర్చుకున్నారు. శివాలయంలో కొబ్బరిగెలలు, అరటిగెలలు, కంద, పసుపుమొక్కలను సమర్పించి కార్తీక దామోదరుని నోములు తీర్చుకున్నారు. పలు శివాలయాల్లో లక్షపత్రి పూజ నిర్వహించారు. అనంతరం శివాలయంలో దీపోత్సవాన్ని నిర్వహించారు. గ్రామాల్లో జలాతోరణం నిర్వహించారు. మండలంలో పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు శివాలయాలకు వెళ్లి పూజలు జరిపించి నోములు తీర్చుకున్నారు.

కార్తీక దీపారాధన
పి.గన్నవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం సాయంత్రం మహిళలు దీపారాధన చేశారు. వివిధ రకాల పండ్లు స్వామి వారికి సమర్పించారు. పి.గన్నవరం గరుడేశ్వరస్వామి ఆలయం, బెల్లంపూడి, మానేపల్లి, ఉడిమూడి, ముంగండ, నరేంద్రపురం, మొండెపులంక, వై.కొత్తపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గరుడేశ్వరస్వామిఆలయంలో జ్వాలాతోరణం
పి.గన్నవరం గరుడేశ్వరస్వామి ఆలయంలో జ్వాలతోరణం నిర్వహించారు. తొలుత గరుడేశ్వరస్వామిని ప్రత్యేక పల్లకీలో ఊరేగించారు. జ్వాలాతోరణం చుట్టూ స్వామివారి ప్రదక్షణ చేయించారు. అనంతరం భక్తులు జ్వాలాతోరణం నుంచి వచ్చే వెండి గడ్డి రెన్నులను ప్రసాదంగా భావించి తీసుకోవడానికి భక్తులు ఉత్సాహం చూపారు.

ఘనంగా జ్వాలాతోరణం
అంబాజీపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాల్లో కార్తీకపౌర్ణమి పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి స్వామివారిని పల్లకీలో తీసుకువచ్చి జ్వాలాతోరణం చుట్టూ ప్రదక్షణ నిర్వహించారు. కార్తీక పౌర్ణమి రోజున 365 వత్తులు వెలిగించడం ఎంతో పుణ్యమని వేదపడింతులు పేర్కొన్నారు.

బాలకృష్ణ అభిమానుల సందడి
అమలాపురంటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ 109వ చిత్రం డాకు మహారాజ్ టీజర్ విడుదలైన సందర్భంగా అమలాపురం రమా థియేటర్ వద్ద అభిమానులు సందడి చేశారు. టీజర్‌ను వీక్షించిన అనంతరం సినిమా సూపర్‌హిట్ ఖాయమని అభిమానులు సందడి చేశారు. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకట రమణ కేక్ కట్‌చేశారు. ఆవుపాటి వేణుగోపాల్, రాంబాబు, దుర్గారావు, థియేటర్ మేనేజర్ కేతా వీరబాబు, అనిశెట్టి ప్రకాష్, నిమ్మకాయల సురేష్, తాడి భద్రి, గణేష్, బాలయ్య పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు
ముమ్మిడివరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భార్య శ్రీవాణి బంధువులను తీసుకువచ్చేందుకు ఇంటి నుంచి బస్టాండ్‌కు వెళ్లి అదృశ్యమైందని ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి తొమ్మిదో వార్డుకు చెందిన ఉందుర్తి సుబ్బారావు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత సర్వే ప్రకారం రైల్వేలైన్ ఏర్పాటు చేయాలి


నిరసన తెలుపుతున్న వివిధ గ్రామాల ప్రజలు

మామిడికుదురు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి నుంచి నరసాపురం వరకు ఏర్పాటు చేసే రైల్వేలైన్ కొరకు పాశర్లపూడి నుంచి చించినాడ వరకు పాతసర్వే ప్రకారం రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు శుక్రవారం మొగలికుదురులో నిరసన తెలిపారు. 2002లో చేసిన సర్వే ప్రకారం కాకుండా ఇటీవల కొత్తగా రైల్వే సర్వే పనులు చేస్తున్నారని, దాని వల్ల తమ విలువైన భూములు, భవనాలు కోల్పోతున్నామని నగరం, మొగలికుదురు, గెద్దాడ, పాలగుమ్మి తదితర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. పాత సర్వే ప్రకారమే రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని, లేకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. రైల్వే అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా అయినవిల్లి ఎస్ఐ జోషి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. నిరసనలో జాలెం సుబ్బారావు, కోళ్ల సురేష్‌బాబు, కడలి బాబురావు, దొంగ సత్తిబాబు, తాటికాయల ఉదయభాస్కరావు, రాయుడు ఆనందరావు, జేటి తదితరులు పాల్గొన్నారు.

చండీ హోమం
కాట్రేనికోన, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మావుళ్ళమ్మ ఆలయంలో కార్తీకపూర్ణిమ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఆణివిళ్ళ ఫణికాంత్ ఆధ్వర్యంలో భక్తులు చండీ హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రంధి రాంప్రసాద్, ఆణివిళ్ళ సాయిబాబా, గ్రంధి నానాజీ, రామకృష్ణపరమహంస, సుంకర పవిత్రకుమార్, సుంకర బుజ్జి పాల్గొన్నారు.

ఎన్డీఆర్ఎఫ్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన
విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

అమలాపురం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఎన్డీఆర్ఎఫ్ అధికారులు ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వరదలు, అగ్ని ప్రమాదాల్లో చిక్కుకున్నపుడు ఏవిధంగా బయటపడాలో తెలియజేశారు. విపత్తుల సమయంలో ప్రథమ చికిత్స ఏవిధంగా చేయాలో చూపించారు. ఎన్డీఆర్ఎఫ్ ఎఫ్-10బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.గోపాలకృష్ణ, సిబ్బంది ఎన్డీఆర్ఎఫ్ సేవలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంసీఎస్ మదన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జేవీ కృష్ణారావు, సివిల్ ఇంజనీరింగ్ విభాగ అధ్యాపకుడు బీహెచ్ సాయిచైతన్య తదితరులు పాల్గొన్నారు.

21న మంద కృష్ణమాదిగ పర్యటన
అమలాపురంటౌన్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఈనెల21న జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళన మహాసభను విజయవంతం చేయాలని మాదిగ ఉద్యోగుల సంఘ నాయకులు పిలుపునిచ్చారు. డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎంఈఎఫ్ అధ్వర్యంలో అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు మడికి సత్యనారాయణ అధ్యక్షతన మాదిగ ఉద్యోగుల సమావేశం జరిగింది. మాదిగ ఉద్యోగ సంఘ నాయకులు మడికి శ్రీరాములు, తేన్నేటి రాజబాబు, మట్లా నాగేశ్వరరావు, కొరుకూరి కృపావరం, నవుండ్రు వాడపల్లి పాల్గొన్నారు.

కార్తీక బౌద్ధ పౌర్ణమి వేడుకలు
అమలాపురం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక బౌద్ధ పౌర్ణమి వేడుకలను శుక్రవారం అమలాపురం త్రిరత్న బుద్ధ విహార్‌లో సెక్రటరీ జనరల్ డీబీ లోక్ అధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, బుద్ధవిహార్ చైర్మన్ గొల్లపల్లి సూర్యారావు హాజరయ్యారు. లోక్ మాట్లాడుతూ బౌద్ధ పౌర్ణమి రోజున గౌతమ బుద్ధుడు 60మంది బౌద్ధ భిక్షువులను ప్రపంచం నలుమూలలకు బహుజన హితం కోసం, బౌద్ధధర్మ వ్యాప్తి కోసం పంపించారన్నారు. కార్యక్రమంలో బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు కాశి పరుశురాంబోధి, జిల్లా ప్రధాన కార్యదర్శి ములపర్తి సత్యనారాయణ, ఈవీవీ సత్యనారాయణ, గోసంగి ఆనందరావు, కాశి వెంకట్రావు, కోడూరి రామమూర్తి, జల్లి శ్రీనివాసరావు, జె.రంగారావు, బొంతు రమణ, జి.వెంకటేష్, నాతి శ్రీనివాసరావు, యు.సత్యనారాయణ, కె.వెంకటబాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారావు మృతి టీడీపీకి తీరని లోటు
ముమ్మిడివరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సబ్బతి ధర్మారావు మృతి పార్టీకి తీరనిలోటని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. సీహెచ్.గున్నేపల్లిలోని నల్లా వారిపేటలో శుక్రవారం జరిగిన ధర్మారావు సంతాప సభలో ఎంపీ మాట్లాడారు. ధర్మారావు చిత్రపటానికి పూజలుమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బౌద్ధమత రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, జిల్లా అధ్యక్షుడు కాశీరాం బోధి, ముస్లిం మతగురువులు మహ్మద్ అసిన్‌అబ్బుల్లా, క్రైస్తవమత పెద్దలు కాశి బాలయ్య బండి సుదర్శన్, బలగం ప్రసన్నకుమార్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బతి ఫణిఈశ్వరరావు, నాయకులు గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహరావు, నల్లా బాబాయి, కట్టా వెంకటేశ్వరరావు, అనిశెట్టి రామకృష్ణ, సఖిలే వెంకటేశ్వరరావు, నల్లా ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు ఎంపికలు
అమలాపురం టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అండర్-13 జిల్లా స్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల ప్రాంగణంలో నిర్వహించారు. 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలైన ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలను ఈనెల19నుంచి తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసినట్టు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. బాలురలో తాడి సాయివెంకటేష్, సాధనాల శ్రీసంతోష్ ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో బి.బ్లెస్సీ, పనిశెట్టి ధరణి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. విజేతలను విద్యానిధి చైర్మన్ ఏబీ నాయుడు, ప్రిన్సిపాల్ మాధవి, చెస్ అసోసియేషన్ ప్రతినిధులు దొమ్మేటి సునీల్, కుడుపూడి ప్రసాద్ అభినందించి సర్టిఫికెట్లు అందించారు.

బిర్సాముండా జయంతి


కలెక్టరేట్‌లో బిర్సాముండా జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ, డీఆర్వో తదితరులు

అమలాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అమలాపురం కలెక్టరేట్‌లో గిరిజన స్వాతంత్ర సమరయోధుడు బిర్సాముండా 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిర్సా ముండా భారతీయ అటవి జాతుల స్వాతంత్ర్య సమరయోధుడని అన్నారు. ఆయన ముండా జాతికి చెందిన జానపద నాయకుడని పేర్కొన్నారు. ఆయన 22ఏళ్ల వయస్సులోనే బ్రిటీషర్లపై యుద్ధం ప్రకటించారన్నారు. తద్వారా భారత స్వాతంత్ర్యోద్యమంలో చరిత్రలో ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచిపోయారన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ గొప్ప గిరిజన నాయకుడు భగవాన్ బిర్సాముండా జన్మదినం నవంబరు 15వతేదీన ప్రతీ సంవత్సరం జాతీయ గౌరవ్ దివాస్‌గా జరుపుకోవాలని, గత ఏడాది ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని నాగశిరీష మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో 17ఆవాసాల్లో 560మంది అణగారిన వర్గాలకు చెందిన గిరిజనులు నివసిస్తున్నారని, వీరి సంక్షేమానికి సహకరిస్తామనానరు. కార్యక్రమంలో డీఆర్వో మదన్‌మోహనరావు, ఏవో కాశీవిశ్వేశ్వరరావు, జిల్లావికాసం మేనేజర్ జి.రమేష్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
అంబాజీపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. అమలాపురం మండలం బండారులంకకు చెందిన బట్టు నాగపుల్లేశ్వరరావు(45) ఈనెల 13న గంగలకుర్రులో జరుగుతున్న పడిపూజకు వెళ్తుండగా ప్రమాదానికి గురై గాయపడ్డాడు. అతడిని అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

108 సువర్ణ పుష్పాలతో పూజ
అమలాపురం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బండారులంకలోని శ్రీభువనేశ్వరీసమేత త్రయంబకేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన రూ.10లక్షల విలువైన పుష్పాలను శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి-చంద్రకళ దంపతులు ఆలయ పురోహితుడు గుమ్మిడి సద్గురుసత్యనారాయణకు అందజేశారు. అమ్మవారికి భక్తులు కుంకుమ పూజ చేశారు. అనంతరం స్వర్ణ పుష్పాలతో పూజ చేశారు. పేరి శ్రీనివాసశర్మ రూ.50వేలు విలువైన స్వర్ణ శ్రీలక్ష్మీప్రతిమను, గుమ్మిడి ప్రసాద్ రూ.25వేలు విలువైన వెండి పళ్లెం సమర్పించారు.

యానాంలో ఆర్‌సీఎస్ పర్యటన
యానాం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి సహకార శాఖకు సంబంధించి రిజిస్టర్ ఆఫ్ కోపరేటివ్ సొసైటీస్ (ఆర్‌సీఎస్) యశ్వంతయ్య యానాంలో పర్యటించారు. రెండు రోజుల పర్యటనకు యానాం వచ్చిన ఆయనను సహకారశాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం యానాం పరిపాలనాధికారి కార్యాలయం సమావేశపు హాల్‌లో వివిధ సొసైటీ సభ్యులతో సమావేశమయ్యారు. యానాంలో సహకార సంఘాల పనితీరుపై చర్చించారు. ఈసందర్భంగా పుదుచ్చేరి సహకార శాఖ పరిధిలోని స్టోర్స్, బ్యాంక్, పలు సొసైటీలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయనను యానాం స్టోర్స్ అధ్యక్షుడు లంక విద్యాసాగర్, యానాం పబ్లిక్ సర్వెంట్స్ సొసైటీ అధ్యక్షుడు పోలిశెట్టి ఆదినారాయణ తదితర సొసైటీ కార్యవర్గ సభ్యులు యశ్వంతయ్యను సత్కరించారు. ఈసందర్భంగా ది. పాండిచ్చేరి కోఆపరేటివ్ బ్యాంక్ యానాం శాఖ ఉత్తమ ప్రతిభ అవార్డును అసిస్టెంట్ మేనేజర్‌గా సూర్యనారాయణకు అందజేసి శాలువాతో సత్కరించారు.

రీసర్వే గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి
అంబాజీపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రీసర్వే గ్రామసభలు నిర్వహిస్తుందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు జె.వెంకటేశ్వరి అన్నారు. మాచవరం పంచాయతీ వద్ద సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దారు మాట్లాడుతూ రికార్డులు, సర్వేలో తప్పులను గ్రామసభల్లో సరిచేసుకోవచ్చన్నారు. వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక
యానాం, నవంబరు15(ఆంధ్రజ్యోతి):గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఈనెల24నుంచి జరిగే 68వ జాతీయ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఈత పోటీలకు యానాం నుంచి ఎనిమిది మంది క్రీడాకారులు అండర్ -14విభాగంలో ఎంపికైనట్లు యానాం సాయిస్పోర్ట్స్ సెంటార్ ఇన్‌చార్జి ఎస్.ఉదయ్‌కుమార్ తెలిపారు. డి.సహస్ర చందన, కె.సతీష్‌కుమార్, ఎస్.కె.ఓంకార్, పి.నిషంత్‌లు పుదుచ్చేరి తరఫున, వి.నాగసాయి, వి.మణికంఠ, జాస్విన్ నాయుడు, బి.పురానందీశ్వర రాజులు ఆంధ్రప్రదేశ్ తరఫున పోటీల్లో పాల్గొంటారన్నారు.

దెందుకూరికి అభినందనల వెల్లువ
అల్లవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ అల్లవరం మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజును టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులు, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, వేగిరాజు సుబ్బరాజు, అల్లూరి సోమరాజు, కరాటం ప్రవీణ్, తోట శ్రీదేవి నరసింహరావు, పెన్మత్స సోమరాజు, పెద్దిరెడ్డి రాము, కంకిపాటి వీరబాబు, నల్లా రాము, పిల్లా ప్రసాద్, పిండి గణపయ్య, కె.బాబి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం
ఉప్పలగుప్తం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూనవరంలో జనసేన నాయకుడు ఆకుల బుజ్జి ఆధ్వర్యంలో అంబాజీపేట లీజర్ లైట్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ వాకపల్లి ఈశ్వరీసత్యనారాయణ, కూటమి నాయకులు ఆకుల రాము, నాగిరెడ్డి రాంబాబు, సుందరనీడి ఏసుబాబు, సుందరనీడి రాజబాబు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు
యానాం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువకేంద్రం యానాం శాఖ ఆధ్వర్యంలో యానాంలో విద్యార్థులు మొక్కలు నాటారు. భగవన్ బిర్సాముండాజీ జయంతి పురస్కరించుకుని జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణాసుధాకర్, జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, ఎస్ఎస్ఎస్, ఎన్‌వైకే వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అభినందనీయం
మామిడికుదురు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని మామిడికుదురు సర్పంచ్ గౌస్‌మొహిద్దీన్ పేర్కొన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. వైద్యులు ఎం.ఉదయ్, కె.గురుప్రసాద్‌లు 150మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో మీర్‌కాధమ్ హుస్సేన్, సయ్యాద్‌రాజబ్ అలీ, నూర్విన్ అబ్బాస్, గుల్షన్ పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం

కాట్రేనికోన, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మావుళ్ళమ్మ ఆలయంలో కార్తీకపూర్ణిమ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఆణివిళ్ళ ఫణికాంత్ ఆధ్వర్యంలో చండీహోమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్జీగంది రాంప్రసాద్, ఆణివిళ్ళ సాయిబాబా, గ్రంధి నానాజీ తదితరులున్నారు.

భీమేశ్వరాలయంలో జేసీ నిషాంతి పూజలు

ద్రాక్షారామ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని కార్తీకపౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం జేసీ నిషాంతి సందర్శించారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆమె వెంట ఆర్డీవో దేవరకొండ అఖిల ఉన్నారు.



వెదురుపాక విజయదుర్గా పీఠంలో కార్తీక దీపోత్సవాన్ని జరుపుతున్న దృశ్యం

విజయదుర్గా పీఠంలో ఘనంగా కార్తీక దీపోత్సవం

రాయవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠం వద్ద కార్తీక దీపోత్సవం శుక్రవారం రాత్రి కన్నుల పండువగా జరిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి వందలాది మంది మహిళలు, యువతులు తరలివచ్చారు. తొలుతగా పీఠం వద్ద సీతాసదనంలో విజయదుర్గా అమ్మవారి ఉత్సవ విగ్రహానికి, శ్రీదేవి భూదేవి సమేత విజయ వేంకటేశ్వర స్వామి, భవాని సమేత అష్టలింగేశ్వరస్వామికి పూజలు చేశారు. గాడ్ స్వామి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి దీపోత్సవాన్ని ప్రారంభించారు. విజయదుర్గా అమ్మవారికి అష్టోత్తర సహస్ర నామాలతో కుంకుమ పూజలు, వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు అష్టోత్తర పూజలు, శివఅష్టోత్తర పూజలు చేశారు.

వైభవంగా దీపోత్సవం: పీఠం వద్ద జరిగిన కార్తీక దీపోత్సవంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. పీఠం వద్ద వేదాంత రాజగోపాలచారి ఆధ్వర్యంలో సాయిరామాచార్యులు, మాధవాచార్యులు, శివ, రవిశంకర్ పర్యవేక్షణలో జరిపారు. మహిళలు వెయ్యి దీపాలు వెలిగించడంతో పాటు మహాలక్ష్మి అమ్మవారి చిత్రపటానికి లక్ష్మీపూజ నీరాజన మంత్ర పుష్పాలు, మహానివేదన చేశారు. దీపోత్సవానికి విచ్చేసిన భక్తులనుద్దేశించి పీఠాధిపతి గాడ్‌స్వామి మాట్లాడారు. కార్తీక దీపోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కోలాట నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు జి.సత్యవెంకట కామేశ్వరి, భాస్కరనారాయణ, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, పీఠం పీఆర్వో బాబి, భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తీకపౌర్ణమి పూజలు

• తెల్లవారుజాము నుంచే శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు • ప్రత్యేక పూజలు, అభిషేకాలు • కార్తీకదీపాలతో మహిళల సందడి



రాయవరంలో ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి

రాయవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. తొలుత విజయవేంకటేశ్వర స్వామికి సుప్రభాతసేవ, తులసిదళ అర్చనలు జరిపారు. అనంతరం విజయదుర్గా అమ్మవారికి లలితా అష్టోత్తర, సహస్రనామాలు, దుర్గాత్రిశతి, ద్వాత్రింశ నామావళి, లక్ష్మి సరస్వతి అష్టోత్తరాలతో కుంకుమ పూజలు, భవాని శంకర సమేత అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం జరిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో బాబి, భక్తులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు: మండలంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి పూజలు జరిపారు. సోమేశ్వరం శ్రీబాలత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామికి అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ జరిపారు. వెంటూరు సోమేశ్వరస్వామి, వెదురుపాక సోమేశ్వరస్వామి, లొల్ల రామలింగేశ్వరస్వామి, పసలపూడి రాజరాజేశ్వరస్వామి, చెల్లూరు అగస్తేశ్వరస్వామి, రాయవరం కాశీవిశ్వేశ్వర స్వామి, వి.సావరం భీమేశ్వరస్వామి ఆలయాలు కిటకిటాడాయి. మండలంలోని పలు వైష్ణవ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. అంగర, టేకి, కపిలేశ్వరపురం, నల్లూరు, వల్లూరు, కాలేరు తదితర గ్రామాల్లో శైవక్షేత్రాలు, విష్ణాలయాలు కిటకిటలాడాయి. వేకువజామునే భక్తులు గోదావరి స్నానం చేసి ఆలయాల వద్ద బారులుతీరారు. స్వామివారికి అభిషేకాలు జరిపి మొక్కులు చెల్లించారు. నూతన దంపతులు స్వామివారికి పువ్వు పిండె సమర్పించారు. శైవక్షేత్రాల్లో సాయంత్రం జ్వాలా తోరణం వెలిగించారు. అనంతరం జరిగిన గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జ్వాలాతోరణం

రావులపాలెం: కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని జ్వాలాతోరణం వేడుకను ఉత్సాహంగా జరిపారు. మండలంలోని శివాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు.



కొత్తపేట మండలం పలివెల ఉమాకొప్పేశ్వర పార్వతీ అమ్మవారు

ఆత్రేయపురం: మండలంలో కార్తీక పౌర్ణమి వేడుకలను మహిళలు భక్తి శ్రద్ధలతో జరిపారు. వేకుమజామునే పుణ్యస్నానాలు చేసి గోదావరి నదిలో దీపాలు వదిలారు. ఆయా శివాలయాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో దీపాలంకరణ చేశారు. ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయం, వాడపల్లి విశ్వేశ్వరస్వామి ఆలయాలు కిటకిటలాడాయి. శివాలయాల్లో శివుడికి అభిషేకాలు చేశారు. ర్యాలి అయ్యప్పస్వామి ఆలయం వద్ద కార్తీక వనసమారాధన నిర్వహించారు.

కన్నుల పండువగా జ్వాలాతోరణం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రపాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంతో పాటు వివిధ శివాలయాల వద్ద శుక్రవారం రాత్రి జ్వాలాతోరణం జరిపారు. వాడపల్లి విశ్వేశ్వరస్వామి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిపారు. అనంతరం జ్వాలాతోరణం వెలిగించి వైభవంగా జరిపారు.



కపిలేశ్వరపురంలో స్వామివారికి అభిషేకం చేసున్న అర్చకుడు కృష్ణభగవాన్

పలివెల కొప్పేశ్వరస్వామి ఆలయంలో

కొత్తపేట: పలివెల శ్రీ ఉమాకొప్పేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి పూజలు భక్తి శ్రద్ధలతో జరిపారు. ఆలయ ప్రాంగణంలో పలువురు మహిళలు కొప్పేశ్వర పార్వతి అమ్మవార్లకు కుంకుమ పూజలతో పాటు పౌర్ణమి దీపాలు వెలిగించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.



ఆత్రేయపురం మండం ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కోటిపల్లిలో గోదావరికి పౌర్ణమి హారతి



కోటిపల్లి రేవులో పూజలు చేస్తున్న వాసంశెట్టి సత్యం దంపతులు

కె.గంగవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కోటిపల్లిలో కార్తీకపౌర్ణమి సందర్భంగా గోదావరి మాతకు శుక్రవారం హారతినిచ్చారు. ఛాయా సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను నదీ తీరానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్మికశాఖా మంత్రి సుభాష్ తండ్రి టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోదావరి హారతి ఇచ్చారు. కార్యక్రమంల ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పెమ్మాడి బేబి, కూటమి నాయకులు జి.రామకృష్ణ, సీహెచ్ రమణ, వెంటూరు వీర్రాఘవులు చౌదరి, అధిక సంఖ్యలో భక్తులు, దేవస్థానం, మాన్సాస్ ట్రస్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన వాడపల్లి ఆలయం



ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

ఆత్రేయపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరించిన భక్తులు స్వామివారికి అష్టోత్తర పూజ లు, నిత్యకల్యాణాలు చేశారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,25,603 వచ్చినట్టు ఉపకమీషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అన్నదాన ట్రస్టుకు కాకినాడకు చెందిన దేవరకొండ వెంకటనర్సమ్మ కుటుంబ సభ్యులు లక్ష విరాళం అందించారు. దాతకు స్వామి వారి చిత్రపటం అందించారు.

తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా సత్యవతి



గడి సత్యవతి

మండపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) మండపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకురాలు మండపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గడి సత్యవతి తూర్పుకాపు రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అమె భర్త రాంబాబు పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేశారు. గత ఎన్నికల్లో టీడీపీ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఓటమిపాలైన ఆమెకు ప్రభుత్వం అధికారంలోకి రాగానే తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవి దక్కటంపై అమె అభిమానులు, పార్టీశ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సహకారంతో తనకు పదవి దక్కిందని దీనికి సహకరించిన ఆయనకు, పార్టీ నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలి పారు. ఆమెకు పదవి దక్కటంపై టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, చింతల శ్రీను, వాడా ప్రసాదరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మందపల్లి



మందపల్లి దొరబాబు

మండపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండపేటకు చెందిన టీడీపీ సీనియర్ నేత మాజీ కౌన్సిలర్ మందపల్లి దొరబాబుకు రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి దక్కింది. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సహకారంతో తనకు ఈ పదవి దక్కిందని దొరబాబు అన్నారు. డైరెక్టర్‌గా ఇచ్చినందుకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, పార్టీనేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



డివైడర్ ఏర్పాటు చేయాలని అధికారులకు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్ తదితరులు

చెముడులంక వద్ద డివైడర్ ఏర్పాటు చేయరూ..

ఆలమూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చెముడులంక లంక గ్రామాలకు కూడలిగా ఉంటుందని ఇక్కడ డివైడర్ ఏర్పాటు చేయాలని శుక్రవారం చెముడులంకలో సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ అధ్వర్యంలో గ్రామస్తులు, రైతులు వినతిపత్రం ఇచ్చారు. చెముడులంక వద్ద అనధికార డివైడర్ ఉండటం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని దాన్ని మూసివేయాలని హైవే ఏజీఎం మూర్తి, ప్లాజా మేనేజర్ వెంకట్రావుతోపాటు పలువురు అధికారులు శుక్రవారం అక్కడికి చేరుకుని స్థానికులతో చర్చించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు వారు సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



ద్రాక్షారామలో ధాన్యం నమూనాలు సేకరించే తీరును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

ద్రాక్షారామ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ పీఏసీసీఎస్ పరిధిలో రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం జాయింట్ కలెక్టరు టి.నిషా ంతి తనిఖీ చేశారు. నమూనాలు తీసే విధానాన్ని జేసీ పరిశీలించారు. రైతు సేవా కేంద్రం పనితీరుపై రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విధానంపై సిబ్బందిని అడిగారు. సేవా కేంద్రం వద్ద రైతు నుంచి ధాన్యం మిల్లుకు రవాణా చేయించారు. కార్యక్రమంలో జేసీ వెంట ఆర్డీవో దేవరకొండ అఖిల, మండల వ్యవసాయాధికారి ఎన్.సత్యప్రసాద్, పీఏసీసీఎస్ సీఈవో పెంకె సత్యనారాయణ, వ్యవసాయ సహాయకులు సీహెచ్ రాజ్‌కుమార్, ఆర్.హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కోరిన మిల్లుకే ధాన్యం : జేసీ

కె.గంగవరం: రైతు కోరిన మిల్లుకే ధాన్యం పంపించే ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. శుక్రవారం కుందూరు గ్రామం లో ఆర్ఎస్‌కే ద్వారా ధాన్యం కొనుగోలు పరిశీలించారు. ట్రాక్టర్‌కు ఉన్న జీపీఎస్ ఎలా పనిచేస్తుందో తెలుసుకున్నారు. ధాన్యం నాణ్యత పరిశీలించే టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఆపరేటర్, ట్రాన్స్‌పోర్టు మోనటరింగ్ అధికారి, కస్టోడియల్ అధికారులు ఎలా పని చేస్తున్నారో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతు లతో జేసీ మాట్లాడారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల, వ్యవ సాయశాఖ ఏడీఏ ఏవీఎస్ రంగారావు, ఏవో బలుసు రవి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీరామ్ ప్రసాద్, వీఏఏ పావని, సివిల్ సప్లైస్ అధికారులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో స్థానం కల్పించకపోవడం విచారకరం

మండపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేసిన నూర్‌బాషా సంఘీయులు ఓట్లు వేసేందుకే తప్ప నామినేటెడ్ పదవులకు అర్హులుకారా అని మండపేట నియోజకవర్గ నూర్‌బాషా సంక్షేమ సంఘ నాయకులు ప్రశ్నించారు. మండపేటలో శుక్రవారం నూర్‌బాషా సంఘ నాయకుడు షేక్ చినబాదుల్లా మాట్లాడుతూ నామినేటెడ్ పోస్టుల భర్తీలో కనీసం నియోజకవర్గంలో నూర్‌బాషా వర్గీయులకు స్థానం కల్పించకపోవటంపై ఆయన అవేదన వ్యక్తం చేశారు. తమ వర్గీయులకు నామినేటెడ్ పోస్టుల్లో డైరెక్టర్ పదవులకు కూడా నోచుకోకపోవటం బాధాకరమన్నారు. నూర్‌బాషా కార్పొరేషన్‌పై ప్రభుత్వం ప్రస్తావించకపోవటంపట్ల వారు విచారం వ్యక్తం చేశారు. తమ ఆవేదనను గుర్తించి తమకు నామినేటెడ్ పదవుల్లో తగిన గుర్తింపు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లను కోరారు. ఇప్పటికైనా నామినేటెడ్ పదవులపై దృష్టిపెట్టి తమకు తగిన గుర్తింపు ఇవ్వాలని ఆయన కోరారు.



రాయవరం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు



కొత్తపేట వికేవీ డిగ్రీ కళాశాలలో జరిపిన పుస్తక ప్రదర్శన

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

గ్రంథాలయ వారోత్సవాల్లో వక్తలు

కొత్తపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తకం పఠనం అలవర్చుకోవాలని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కళాశాల లైబ్రరీ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, సీహెచ్ఎన్ రాణి, జానిక్యరామ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయవరం: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాయవరం గ్రంథాలయంలో ప్రదర్శించిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. లైబ్రేరియన్ ఎస్.రత్నాబాయి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలన్నారు. లైబ్రేరియన్ పుస్తకాలను ప్రదర్శించగా గ్రామంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తిలకించారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండో రోజు ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో జరిపారు. పుస్తక ప్రదర్శన జరపగా, వివిధ పాఠశాలల విద్యార్థులు, పాఠకులు దీన్ని తిలకించారు. గ్రంథాలయాధికారి టి.నమఃశివాయ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ శాఖ గ్రంథాలయంలో గ్రంథాయల వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పుస్తక ప్రదర్శనను ఉపాధ్యాయురాలు సీహెచ్ రత్న పద్మావతి ప్రారంభించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు డి.సత్యనారాయణ, గ్రంథాలయాధికారి ఎంవీ సూరిబాబు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయాధికారి ఎస్.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రంథా లయ వారోత్సవాలు జరిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ వారోత్సవాలు 20 వరకు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సత్యమూర్తి, బీపీఎన్ రెడ్డి, సుభాషిణి, సిద్ధార్థ, రాజేంద్ర, రమేష్, యువరాజ్, సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో మాట్లాడుతున్న సతీష్

కపిలేశ్వరపురం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్ అన్నారు. శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు పుస్తక ప్రదర్శన జరిపారు. గ్రంథాలయ అధికారిణి డి.శివకుమారి, వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయని సురేఖ, పాఠశాల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సతీష్‌రాజు



చిలువూరి సతీష్‌రాజు

రావులపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరక్టర్‌గా రావులపాలానికి చెందిన చిలువూరి సతీష్‌రాజు ఎంపిక య్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా ఉన్న సతీష్‌రాజుకు టీడీపీ అధిష్టానం క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రకటించింది.





ఆలమూరులో జరిగిన పంచాయతీ కార్యదర్శుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజు. పక్క చిత్రంలో రాయవరం సభలో మాట్లాడుతున్న ఈవో పీఆర్డీ శ్రీనివాసరావు

సమగ్ర ప్రణాళికతో గ్రామాభివృద్ధి జరగాలి

ఆలమూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే అభివృద్ధి ప్రణాళికలు సమగ్రంగా ఉండేలా రూపొందించాలని ఎంపీడీవో ఎ.రాజు సూచించారు. ఆలమూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఒక రోజు శిక్షణ తరగతులు జరిపారు. కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

రాయవరం: పంచాయతీ నిధులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఈవో పీఆర్డీ ఎం.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, పలు శాఖల సిబ్బందితో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ఎన్.గోపాల్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సుధారాణి, వెలుగు ఏపీఎం నాజర్ హుస్సేన్, హౌసింగ్ ఏఈ జీఎస్ దాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫెర్సీ, వ్యవసాయశాఖ ఏవో కె.ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారుల ఆందోళన



గ్యాస్ కోసం ఆందోళన చేస్తున్న వినియోగదారులు

ఆత్రేయపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్యాస్ వినియోగదారులకు సక్రమంగా అందించకపోవడంతో సిలిండర్లను రోడ్డుపై పెట్టి ఆందోళన వ్యక్తం చేశారు. ఆత్రేయపురం గ్రామానికి చెందిన భారత్ గ్యాస్ వినియోగదారులకు రాజమహేంద్రవరం గ్యాస్ ఏజెన్సీ నుంచి వినియోగదారులకు సరఫరా చేయాల్సి ఉంది. ఆత్రేయపురం లాకుల వద్ద ఉన్న భారత్ గ్యాస్ పాయింట్ వద్ద వినియోగదారులకు గ్యాస్ సరఫరా చేయాల్సి ఉంది. కొన్ని రోజుల నుంచి వినియోగదారులకు గ్యాస్ పాయింట్ వద్ద సిలిండర్లను సప్లై చేయకపోవడంతో ఏజెన్సీ నిర్వహకులపై మండిపడ్డారు. శుక్రవారం గ్యాస్ పాయింట్ వద్ద పలువురు వినియోగదారులు సిలెండర్లను రోడ్డుపై పెట్టి ఆందోళన చేశారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వెలిచేరులో శుక్రవారం పది లీటర్ల నాటుసారాతో విక్రయాలు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కాత్యాయని తెలిపారు.

సభ్యత్వ నమోదుపై దృష్టిపెట్టండి

కొత్తపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును పార్టీ నాయకులు ఒక యజ్ఞంలా భావించి అధిక సంఖ్యలో జరిగేలా కృషి చేయాలని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం కొత్తపేటలో టీడీపీ సమావేశం టౌన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కంఠంశెట్టి శ్రీను మాట్లాడుతూ సభ్యత్వ నమోదు బూత్‌లు వారీ పటిష్ఠంగా జరగాలన్నారు. అనంతరం పార్టీ నాయకులతో సమీక్ష జరిపారు. సమావేశంలో ముత్యాల బాబ్జి, బూసి భాస్కరరావు, బీర ఇసాక్, తమ్మన సాయిప్రసాద్, అద్దంకి చంటిబాబు, బూసి విష్ణు, పెనుమళ్ళ అన్నవరం, రొట్టా రమణ, ముద్రగడ ఫణి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ సమావేశంలో సభ్యత్వ నమోదుపై మాట్లాడుతున్న మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాసరావు

పథకాల అమలులో డిజిటల్ అసిస్టెంట్ల పాత్ర కీలకం



డిజిటల్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజు

ఆలమూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు పాత్ర కీలకమని ఆలమూరు ఎంపీడీవో ఏ.రాజు అన్నారు. మండల డిజిటల్ అసిస్టెంట్ల సమావేశం శుక్రవారం ఆలమూరులో జరిగింది. గ్రామస్థాయిలో జరిగే ప్రతీ అభివృద్ధి పనులలో డిజిటల్ అసిస్టెంట్ల ముద్ర ఉండేలా పనిచేయాలని సూచించారు. ఆలమూరు-1, కలవచర్ల డిజిటల్ అసిస్టెంట్లు పోస్టులు ఖాళీగా ఉన్నందున వాటిని మీరు సద్దుబాటు చేసుకుని పనిచేయాలని ఎంపీడీవో రాజు కోరారు. ఈసందర్భంగా ఎంపీడీవో రాజును సత్కరించారు.